పొద్దున నూరాముచేస్తూంటే పాలు పట్టిస్తున్నాను

రాత్రి ప్రయాణం బడలిక ఇంకా తగ్గలేదు.

"ఇది విన్నావా?" ఎదురుగా కూర్చుని, ఊరి ముచ్చట్లూ, వాడ ముచ్చట్లూ చెప్పుతున్న అమ్మ సహజస్వరంలో అంది.

"ఏది?"

"లక్ష్మి సంగతి!"

ఉలిక్కిపడ్డాను. "లక్ష్మికేమైంది?"

"ఏమీకాలేదు. లేచి పోయింది — "

నిర్ఘాంతపోయాను, ఆ వార్తవిని. కొన్ని క్షణాలు మూగగా గడిచాయి. నా మనస్సెక్కడో ఉంది. నమ్మకం చిక్కటంలేదు. అమ్మకు అబద్ధం చెప్పవలసిన అవసరం లేదు.

"ఎందుకు పోయింది?"

నా ప్రశ్న అమ్మకు అర్థంకాలేదు. కాదుకూడా. కలిగిన పుట్టిల్లు, అనురాగంచూపే నాన్న, మనుమలు, మనుమరాళ్లు — వీరి మధ్య భూదేవిలా సంచరించే అమ్మకు లక్ష్మిలాంటి నిర్భాగ్యజీవులు చేసే పనులు అర్థంకావు.

"పదిహేనురోజులైంది."

"ఎవరితో?"

"ఎదురింటి మంగపతితో."

ఉలిక్కిపడ్డాను. నిజమా? నలభై దాటాయను కుంటాను మంగపతికి — ఆ వయసున్న వాడితో పాతికేళ్లు నిండని లక్ష్మి లేచిపోవడం వాస్తవానికి దగ్గరగా లేదు.

"ఎవరన్నారు?"

"ఊరంతా . ."

"చూసిందా? 'అట' నా . . . ?" వ్యంగ్యంగా అన్నాను.

అమ్మ అదోలా చూసి లేచిపోతూంటే — "దాని కొడుకెక్కడున్నాడు?" అని అడిగాను. అమ్మకు వినిపించలేదది.

• • •

లక్ష్మి నాకు ఎనిమిదో తరగతిలో తెలుసు. సన్నగా, పొడుగ్గా, కోలముఖం, బారెడు జడ. అంత అందగత్తె అనిపించకపోయినా అనాకారిమాత్రంకాదు. మా ఇంటి తూర్పు సందులో మూడో ఇంట్లో ఉండే లక్ష్మి నాకు తొందరలోనే స్నేహితురాలయింది.

లక్ష్మి కెవరు లేరు. "నా కెవరు లేరు రాధక్కా" అని గాద్గద్యంతో లక్ష్మి చెప్పినప్పుడు, "నేనున్నానులే" అన్నాను.

అయితేనేం అమ్మ, నాన్నలకు లక్ష్మితో నా స్నేహం సుతరాము కిట్టేది కాదు. కారణం నాకు అప్పట్లో తెలియదు.

లక్ష్మి ఆ తరగతిలో ఆగడం, నే హైస్కూల్‌కు పోవడం, మేమిద్దరం అనుకొన్నదే, కాని లక్ష్మికా సంవత్సరమే పెళ్లి చేస్తారనుకోలేదు. ఒకనాడు స్కూలుకుపోతూ "హయ్యర్ ట్రెయినింగ్‌కి వెళ తానులే అక్కా . ." అని చెబుతూంటే నే నేమీ మాట్లాడలేదు. నాకంటె అందమైంది, తెలివైంది, అయినా ఎందుకూ పనికిరాకుండా పోయింది లక్ష్మి.

భర్తకు మలేరియా ఆఫీసులో గుమాస్తా గిరీ. అదే జీవనం. వెనకా, ముందూ అతడే ఆధారం. వంద రూపాయల రాబడి. దాంట్లోనే బొమ్మ టానిక్కులూ, తమ్ముని స్కూల్‌ఫీజూను. ఇంటికో ముప్ఫయి పంపాలి. వీటిలో ఏ ఒక్కటి తక్కువయినా ఎదురయ్యే తాకిడులు తట్టుకొనే శక్తి, స్థైర్యం లేదతనికి.

యాభై రూపాయలు ఇంట్లో ఇచ్చినా, హోటల్ ఖర్చులూ, సిగరెట్ ఖర్చులూకాక, 15 రూపాయలదాకా స్వంతానికి కావాలి. మిగతాదానిలో లక్ష్మి ముగ్గురి భోజనం చూడాలి. చాకలీ, పాలవాడూ తిట్టకుండా చేయాలి. "రాధక్కా, నే నేనాడూ కడుపునిండా తిన లేదు. అయినా నాకు ఆకలికాకపోయేది. వారికి పెట్టితే నాకు నిండిపోతుందక్కా!" అని అమాయికంగా చెప్పే లక్ష్మిని చూస్తూ, నాలో నేనే భగవంతుణ్ని తిట్టేదాన్ని.

లక్ష్మి జీవితం కష్టాలకు పర్యాయపదం. మూడో సంవత్సరంలో లక్ష్మి తల్లిదండ్రులు పొలంలో పిడుగు పడి చావటం తను ఎరగదు. పెదనాన్ననే 'నాన్న' అనేది. జ్ఞాపకం వచ్చిన తరవాత పెదనాన్న ఇంటిదగ్గిర తన బ్రతుకెలా గడిచిందీ నవ్వుతూ చెప్పేది. "పెద

# లక్ష్మి

తల్లి అయితే ఎలా ఉండేదో గాని నాన్న కామె రెండో భార్య. నాన్న మంచివాడే. అయితేనేం, మగవాడెప్పుడూ ఆడదాని మాటలకు విలువ ఇస్తాడు అక్కా! . . . నాన్న ఆఫీసుకు పోతూనే నాకు తిట్లకూ, శాపనార్థాలకూ సమయమయిందనుకోవాలి. అయినా ఆ తిట్లను అంతగా పట్టించుకోకపోయేదాన్ని. మామూలుగా తింటూ, మొట్టికాయలు తింటూ ఎదురు పలక్కుండా జీవించాను. ఎవరిముందూ నే నేడ్చి ఎరగను. కాని అందరూ పడుకొన్న తరవాత, అన్నీ సర్ది, కొంచెంసేపు చదువుకొని, ఆపైన పెరట్లోకి పోయేదాన్ని. ఆ చీకట్లో కూర్చొని మనసారా ఏడ్చి, ఏ అర్ధరాత్రో వచ్చి పడుకొనేదాన్ని. అలా ఏడ్వటానికి సరిపడనిరోజున నాకు నిద్రపట్టేదికాదు. దినం అంతటిలో ఆ ఏడ్చే క్షణాలకోసమే నే నప్పట్లో బ్రతికానంటే అబద్ధం కాదు. కాని పోయిన సంవత్సరంనించి అలా ఏడవ డానికే నోచుకోలేదు."

"ఏమైంది?" ఉత్సుకతతో అడిగాను.

"మామూలుగా ఓ రాత్రి చీకట్లో పెరట్లో కూర్చొని అమ్మ, నాన్నలను తలుచుకొని ఆనాటి వేడి కన్నీరంతా పారబోసుకొని వస్తూంటే పెద్దమ్మ ఎదురయింది. నేనన కోలేదే అక్కా, ఆంత తేలిగ్గా ఒక కన్నెపడుచుమీద నిందవేస్తారని. 'ఎవడే వాడు?' అని నిలదీసి అడుగుతూంటే, లేనిదే ఎవర్ని చూపేది? చెప్పనందుకే నాన్నను లేపి, ఇద్దరూ కలిసి ఇదిగో చూడు అక్కా . ." అంటూ ఆనాటి సంఘటన గుర్తుగా ఎడమతొడ క్రిందుగా ఉన్న పొడుగాటి గాయాన్ని చూపించింది.

"ఏం చేశారు?" గాద్గద్యం, మూర్ఖవం మేళవిం చాయి నా స్వరంలో.

"నాన్న కత్తి తీసికొని విసిరేశారు." అప్పుడు వచ్చింది లక్ష్మి కళ్లల్లోకి నీరు.

"ఆ రాత్రి చెప్పినదాకా కొట్టారు. నే నేడ్వలేదు. ఏడ్చేదాన్నే. కాని నోట్లో గుడ్డలు పెట్టింది అమ్మ. నా జీవితంలో అంత నికృష్టమైన రోజు రాకుండా ఉంటే చాలులే అక్కా, ఎన్ని కష్టాలయినా సంతోషంగా భరిస్తాను." పెదనాన్నగారు ఏమి చెప్పారో, మామయ్య వారంరోజుల్లోనే ఇక్కడికి తీసుకువచ్చారు."

"ఇక్కడెలా ఉంది?"

"క్రొత్తకదా! అందుకే మొట్టికాయలు లేవు. తిట్లుమాత్రమే . ." నవ్వుతూ అంది లక్ష్మి. ఆమెకు అలవాటయ్యాయి బాధలు.

"పని అంతా నువ్వే చేస్తావు కదూ?"

"అందుకు నాకు బాధలేదక్కా. పని చెయ్యకుండా తిండి ఎవడు పెడతా డీ రోజుల్లో? . ."

"చదువుకునేదెప్పుడు?"

"వింటే చాలులే అక్క."

లక్ష్మిని చూస్తే భగవంతుడిమీద నమ్మకం పోతుంది ఎవరికైనా . . లక్ష్మిలాంటి నిర్భాగ్యుల నెందుకు పుట్టిస్తాడో — ఈ భగవంతుడు? లక్ష్మికి సుఖం అంటే తెలుసు. కాని సుఖపడే జీవుల భావాలెలా ఉంటాయో తెలియదు.

• • • •

పెళ్లిబట్టల్లో లక్ష్మిని చూస్తూ అంతరాంతరాల లోనే సంతోషించాను. అత్తగారింటికి పోతూ నా దగ్గిరికి వచ్చి, ఏడ్చింది లక్ష్మి.

"ఎందుకేడుస్తావ్, లక్ష్మి, నీ బ్రతుక్కి వెన్నెల వచ్చిందిలే." నా చీరచెంగుతో ఆ నిర్భాగ్యజీవి కన్నీటిని తుడిచి, అయిదు రూపాయలు చేతిలో పెట్టాను.

"ఏమో, రాధక్కా, ఇన్నాళ్లు ఎలా ఉన్నా, నీ దగ్గిర ఉన్నంతసేపు నా కష్టాలన్నీ మరిచిపోయాను. నువ్వు దూరమవుతున్నావెట్లా? . ."

"ఛీ . . ఛీ . . ! నీకు తెలియదు. నాలుగురోజులు పోతే 'రాధక్క అంటే ఎవరు?' అని అడుగుతావు, పెళ్లి అయిన తరవాత మతులు కూడా మారిపోతా యంటారు." చిలిపిగా నవ్వుతూ లక్ష్మి చుబుకాన్ని ఎత్తాను.

దీనంగా చూసింది లక్ష్మి. కళ్లనిండా నీరు. ఆమె కళ్ళు ఏమో చెబుతున్నాయి. బహుశా నేనన్న మాటలకే బాధపడి ఉండవచ్చు. నా కళ్లల్లోకి కన్నీళ్లు వచ్చాయి. అయినా నే నేం చేస్తాను? అడదాన్ని. నాకు తెలుసు లక్ష్మికి మాటల్లో ఓదార్పు లభించదని. అయినా విస్మయంగా ఏడ్చే లక్ష్మిని, నిరుపయోగమైన మాటలతో ఓదార్చి రైలెక్కించాను.

జ్యోతశ్రీ



మళ్లీ కనిపించలేదు లక్ష్మి. అయినా ఉత్తరాలు రాస్తూండేది. రెండో సంవత్సరం తిరక్కుండానే తనకి బాబు పుట్టాడని రాసింది. డజను చొక్కాలూ, మధ్యలో పాతిక రూపాయలు పార్సిల్ చేశాను.

అదే సంవత్సరం నేను పదివేల కట్నం చెల్లించి కలిగిన ఇంటికి పోయాను. మా వారు ఎలక్ట్రికల్ ఇంజనీరు. కొత్తగూడెం థర్మల్ కేంద్రం దగ్గిర పని చేస్తున్నారు.

అప్పటినించీ లక్ష్మి ఉత్తరాలు రాయటం మానేసింది. నే నేవిధంగాను నిర్వచించలేదు.


కాని మరి రెండు సంవత్సరాలకే లక్ష్మినుండి పిడుగులాంటి వార్త వచ్చింది. వారిని అడిగి వెంటనే బయలుదేరాను. ఆ రోజు లక్ష్మి ఏడ్చిన ఏడ్పు, నే నెన్నడు చూడలేదు. నాకు ఓదార్చడానికి మాటలులేవు. ఏ ఆశచూపి ఈ జీవిని ముందుకు నడపాలి? అఖరికి "ఊరుకో లక్ష్మి . . బాబు ఏడుస్తున్నాడు" అని సముదాయించాను.


నేను సముదాయించేకొద్దీ లక్ష్మికి ఏడ్పు ఎక్కువైంది. నా కేడ్పు రాలేదు. లక్ష్మి కన్నీ ఎదురుదెబ్బలే! 'భగవంతుడా, లక్ష్మి నింకెంతకాలం ఏడ్పిస్తావ్? చంపరాదూ!' అనుకొన్నాను కోపంగా.

"ఎలా జరిగింది?"

"మొన్న బెజవాడ ఆఫీసు పనిమీద బయలుదేరారు. ఖమ్మంలో సిగరెట్స్ కొరకు దిగారట. అంతలోనే రైలు కదిలింది. అదే సమయంలో టికెట్టు లేని దొరలు బండి ఎక్కుతారు కదా, కనీసం కడ్డీ పట్టుకోవడానికి

(తరువాయి 34 వ పేజీలో)







# లక్ష్మి

( 31 వ పేజీ తరువాయి)

కూడా స్థలం దొరకలేదు. చివరి కంపార్టుమెంటు పట్టుకొన్నారు అంతలోనే సిగ్నల్ స్తంభం తగిలి క్రింద పడిపోయారు."

లక్ష్మి కొడుకు పాప రిబ్బన్ గుంజుతున్నాడు. పాప ఏడుస్తూంది.

"లక్ష్మి, ఇన్నాళ్ళ ఎలా ఉన్నా ఇకముందు జాగ్రత్తగా జీవించు. బాబు జీవితానికి ఆధారం నీవే. తెలివితక్కువగా మాత్రం సంచరించకు."

"ఎలా జీవించనే అక్కా..."

"చూస్తానులే."

లక్ష్మి మేనమామగారి ఇంట్లో ఉంటూ అయిదో తరగతి దాకా ప్రైవేట్లు చెప్పుకొనే ఏర్పాట్లుచేశాను.

చెప్పవలసినవన్నీ చెప్పి, నాదగ్గిర ఉన్న పది రూపాయలు బాబు చేతిలో పెట్టి మావారింటికి పోయాను.

లక్ష్మి ఎందుకిలా చేసింది?

బాబుగాడి నేం చేసింది?

వీటికి సమాధానా లెవరు చెబుతారు?" అన్నిటికంటె నాకు చెప్పకుండా లక్ష్మి ఈ పని ఎలా చేసింది? ఆ క్షణాలలో లక్ష్మిమీద ఓ విధమైన కోపం, వెగటు కలిగాయి నాలో.

• • •

"ఏమిటే అంత దీర్ఘంగా ఆలోచిస్తున్నావ్?" అంది అమ్మ.

"అబ్బె, ఏంలేదు — " అంటూ తప్పించుకొని నిద్రపోయిన పాపను పడుకోబెడుతూంటే గుమ్మంలో పోస్ట్‌మన్ కేక వినబడింది.

ఒకటి నాన్నకు, నాకొకటి. దస్తూరీ పరిచితమైనదే.

"రాధక్కా!

మీవారి అడ్రసుకు నీకు రాసిన ఉత్తరం తిరిగి వచ్చింది. అందుకే ఇక్కడకు రాస్తున్నాను.

ఎన్ని కల్పనలు, ఎన్ని అసహ్యకరమయిన మాటలు ఎందరినోట విన్నావో, వాటి నిజానిజాలు తెలుసుకోవాలని ఎంతగా ఆరాటపడుతున్నావో! నీ హృదయం నాకు తెలుసు. 'నా మాటను అలక్ష్యంచేసి, ఇలా ఎందుకు చేశావ్ లక్ష్మి. . .' అని అడుగుతున్నట్లు అనిపిస్తూంది. లేదక్కా! నీ మాటమీదనే నేనిలా లేచి వచ్చాను. నే నిప్పుడు నాగార్జున సాగర్‌లో ఉంటున్నాను. ఆశ్చర్యంగా ఉంది కదూ!

రాధక్కా! నా జీవితంలో జ్ఞాపకం తెలిసిన తరవాత నవ్విన రోజులీ పదిహేనుమాత్రమే· తొలిసారిగా కంటినిండా చీరలు, జాకెట్‌లూ పెట్టెలో పెట్టుకొన్నాను. చక్కని ఇల్లు. ముందు భాగంలో వారు వ్యాపారం పెట్టారు. 'నాది' అని చెప్పుకోవటానికి నా కిక్కడ చాలా ఉన్నాయి. భర్త, ఇల్లు, శాపనార్థాలు లేని దినాలు. హాయిగా జీవిస్తున్నాను. తృప్తిగా శ్వాసిస్తున్నాను.

అయితే ఒకటిమాత్రం నిజం! నే నీ పని చెయదలచుకొన్నప్పుడు ఇలా జరుగుతుందనుకోలేదు. నా లక్ష్యాన్ని నెరవేర్చుకోటానికే నా శీలాన్ని అమ్ముకొంటున్నా ననుకొన్నాను. కాని ఆశించని రీతిలో నా బ్రతుకులో వెన్నెల విరిసింది. నాకోసం, నా బాబు కోసం పాటుపడే వ్యక్తి ఒడిలో జీవిస్తున్నాను.

చాలామంది దృష్టిలో నేను తెగించినదాన్ని, లేచి వచ్చినదాన్ని, మానం చచ్చినదాన్ని, బజారు ముండని. ఏం చెయ్యను చెప్పక్కా? పెదనాన్నగారింట్లోను, మామయ్యగారింట్లోను నే నెలా ఉన్నది నీకు తెలుసు. నీవు ప్రైవేట్లు కుదిరించి పోయిన తరవాత చాలా సంగతులు జరిగాయి. మామయ్యకూ, అత్తయ్యకూ ఊడిగం చేసుకుంటూ బ్రతకటమేనా లక్ష్యం? అదేనా నా జీవిత పరమార్థం?

నా బ్రతుకు నేను బ్రతుకుతున్నా రకరకాల నిందలు, గుసగుసలు. పొరుగమ్మలకు ఏమీ పనిలేదనిపించింది. దానికితోడు అత్తమ్మ దీవనలు . . . నా మనస్సు మొద్దుబారింది. నన్నంటే అన్నారు. కాని అయిదేళ్ల పసికందు చేసిన పాపమేమిటి? కూడన్నా పెట్టకుండా వాతలు పడేట్లు కొట్టారు. ఆ రోజు నేను మధిరపోయాను, బ్లాక్ ఆఫీసులో మిషన్ కొరకు అప్లై చేసేందుకు. నేను లేకుండాచేసి నా బాబుని ఎవరో పెట్టింది తిన్నాడని కొట్టారు. నా బాబును నేను శోషలో చూశాను. నా గుండె తరుక్కుపోయింది. తల్లిగా నా హృదయం తల్లడిల్లింది. ఆ రాత్రి నేనేడ్చిన ఏడ్పు, పెదనాన్న గారింటి దగ్గిర సంఘటన గుర్తు వచ్చింది. నాకు విరక్తి కలిగింది.

పుట్టినప్పటినించీ ఏ సుఖము ఎరుగను. జీవితంలో ఏ క్షణమన్నా హాయిగా గడిపితే అది నీ చేరువలోనే — ఆ క్షణాలుమాత్రం మరిచిపోలేనే, అక్కా. ఇదంతా ఎందుకు రాస్తున్నానంటే .. నేనీ పని ఎందుకు చేశానో చెప్పేందుకు. నీకు తప్ప నే నెవరికీ సంజాయిషి ఇచ్చుకో నక్కర్లేదు.

మంగపతి నీకు తెలుసును. మామయ్యగారి ఇంటికెదురుగా దుకాణం పెట్టుకొన్నాడు. మూడో భార్యనయినా మంచిగానే ఉన్నారు. అసలు వారు మంచి చేసిన తరవాతనే ఇలా తెగించాను.

బాబు పేరిట మూడు వేలు బ్యాంకులో వేయించి; కాన్వెంటులో చేర్పించింది వారే! ఇప్పుడు చెప్పు అక్కా, నేను చేసింది తప్పా? నేను తెగించినదాన్నా?

ఎవరేమన్నా అనుకోనీ . . , నా బాబుకోసం నేనిలా తెగించి లేచివచ్చానని నీ ఒక్కదానివి నన్ను దీవిస్తేచాలు!

పాపకు ముద్దులు. నీకు నమస్సులు.

ఉంటాను అక్కా!

—నీ లక్ష్మి."

"ఎక్కడినించి అమ్మా ఉత్తరం?" అమ్మ వంటగది గుమ్మంలో నించుని అంది.

"మీ అల్లుడిగారి దగ్గిరనించి." లక్ష్మి ఎక్కడ ఉందో ఎవరికీ చెప్పను. లోకం నేర్పిన పాఠమిది. అందుకే అబద్ధం ఆడాను. ★